క్లుప్తంగా

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పుత్తూరు రూరల్: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' సౌజన్యంతో పౌష్టికాహారాన్ని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శంకర్‌నరేన్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ సభ్యులు నారాయణస్వామి, పుష్పమ్మ, కౌన్సిలర్ చిట్టిబాబు, నాయకులు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జాతర

వెదురుకుప్పం: మండలంలోని బాలుపల్లె గ్రామంలో ఉన్న నడివీధి గంగమ్మ ఆలయంలో అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని మంగళవారం రాత్రి పుష్ప పల్లకిలో వేంచేపు చేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు పెట్టి ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు.

తహసీల్దార్‌గా సుబ్రమణ్యం

వడమాలపేట: తహసీల్దార్ గా ఐ.సుబ్రమణ్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తొట్టంబేడు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రోశయ్యను పుత్తూరుకు బదిలీ చేశారు.

పాదయాత్ర బృందం అన్నదానం



అన్నదానం చేస్తున్న భక్తులు

నగరి: ప్రతిఏటా నగరి నుంచి కాణిపాకానికి పాదయాత్ర చేసే వరసిద్ధి వినాయక భక్త బృందం స్థానిక ప్రకాశం రోడ్డు లోని సుందర వినాయక ఆలయం వద్ద అన్నదానం చేశారు. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఈ కార్యక్రమం నిర్వహించారు. 27 ఏళ్లుగా పాదయాత్ర చేస్తున్నామని, కొండ చుట్టు ఉత్సవాలు ముగిసిన మరుదినం అన్నదానం చేసి పాదయాత్రకు పూనుకుంటామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇంద్రయ్య, పాదయాత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణికి రక్తపరీక్ష చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ కోరారు. బుధవారం స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులు, చిన్నారులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను సూపర్‌వైజర్ సుశీల పరిశీలించారు. గర్భిణులతో మాట్లాడారు. ఐరన్, కాల్షియం, విటమిన్స్ కలిగిన ఆహారం, ఆకుకూరలు, పాలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. గర్భిణులు ప్రసవించేవరకు వారికి ఆశా వర్కర్లు తమవంతు సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాధ, గంగాగౌరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తహీనత పిల్లలకు అదనపు కోడిగుడ్లు

కార్వేటినగరం: రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు అదనపు కోడి గుడ్లు అందించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఐసీడీఎస్ సీడీపీవో పద్మసునంద అన్నారు. రక్త హీనత నిర్మూలనలో భాగంగా ప్రభుత్వ పిలుపు మేరకు టీకేఎం పేట, కోదండరామాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన రాజేష్ రక్తహీనతతో బాధపడుతున్న 5 మందికి 25 కోడి గుడ్ల చొప్పున వితరణ చేశారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

చిత్తూరు అర్బన్: నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయనకు ఘన నివాళులర్పించారు. ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించి, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పుత్తూరు రోడ్డులో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు నాని, ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ హేమలత, నాయకులు ఆనంద్, త్యాగరాజులు, మురుగ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు జయప్రకాష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, జయచంద్రనాయుడు, ప్రకాష్‌నాయుడు, కవి, లోక, గిరి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి భూమి పూజ

- జీజీఎంపీ ఫండ్స్ రూ.20 లక్షలు
- ఎమ్మెల్యే ఫండ్స్ నుంచి మరో రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు
- రోజా చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో 700 సిమెంట్ బస్తాల పంపిణీ



పుత్తూరు రూరల్: సిమెంట్ బస్తాలను పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: పుత్తూరు రూరల్ మండలం తిరుమలకుప్పం దళితవాడ బుధవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. తిరుమలకుప్పం సచివాలయ పరిధిలో జీజీఎంపీ ఫండ్స్ రూ.20 లక్షలతో పాటు ఎమ్మెల్యే ఫండ్స్ నుంచి మరో రూ.10 లక్షలతో మొత్తం రూ.30 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డు, ఇంటింటికీ తాగునీటి కొళాయి పనులకు మంత్రి భూమి పూజ చేశారు. గత ప్రభుత్వంలో పక్కా గృహాలు నిర్మించుకుని పూత పనులు ప్రారంభించని 20 కుటుంబాలకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 700 సిమెంట్ బస్తాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామన్నారు. సిమెంట్ బస్తాలు అందుకున్న వారు ఇళ్ల పూత పని పూర్తి చేసుకోవాలని కోరారు. నగరి నియోజకవర్గంలో పాత ఇళ్లు ఉన్న వారికి అవసరమైన సాయాన్ని ట్రస్ట్ నుంచి చేస్తున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి జగనన్న 32 లక్షల మందికి ఇంటి పట్టాలు ఇచ్చి, ఇళ్లు కట్టిస్తున్నారని, ఇది దేశంలోని ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్ద ఎత్తున చేయడం లేదని, ఆ ఘనత మన సీఎంకే దక్కిందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి, పీఆర్ డీఈఈ వినోద్‌రెడ్డి, ఎంపీడీఓ ఇందిర, గ్రామ సర్పంచ్ సరస, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ విమల, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు గోపియాదవ్, షణ్ముగం, వెంకటేష్, ఏసు, శ్రీజ, శ్యామ్‌కుమార్, గోపి, మునికృష్ణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



నగరి: మూలనెత్తంలో భూమి పూజ చేస్తున్న మంత్రి ఆర్కేరోజా

మూలనెత్తంలో మురుగు కాలువల నిర్మాణానికి...

నగరి: మండలంలోని మూలనెత్తంలో మురుగు కాలువల నిర్మాణానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా భూమిపూజ చేశారు. ఈ ప్రాంతంలో వర్షం కురిస్తే నీరు నిల్వ ఉండి సమస్యగా మారేది. ఇటీవలే ఎంపీపీ సమస్య తీవ్రతను గుర్తించి మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించారు. కాలువల నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు చేయించారు. బుధవారం ఈ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, వెంకటలక్ష్మి, రామ్‌ప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్‌కుమార్, నాయకులు భాస్కర్ రెడ్డి, జయరామ్, యేసు, పరంధామన్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోరూ!

- కలెక్టర్‌కు చెరకు రైతుల వినతి

నిండ్ర: మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ రైతుల సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హరినారాయన్‌కు బుధవారం చిత్తూరులో వినతి పత్రం ఇచ్చారు. నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం మూడేళ్లయినా రైతులకు చెరకు బకాయిలు చెల్లించక పోవడం దారుణమన్నారు. బకాయిలు చెల్లించాలని ఎన్నోసార్లు ధర్నాలు, ఆందోళన చేసినా యాజమాన్యం, అధికారులు స్పందించలేదని, ఇకనైనా రూ.36 కోట్ల బకాయిలను ఫ్యాక్టరీయాజమాన్యం చెల్లించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నారాయణస్వామిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశాలకు ఈనెల 31 ఆఖరు

పుత్తూరు రూరల్: నవోదయ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 31వ తేదీ ఆఖరని ఎంఈఓ తిరుమలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు జవహర్ నవోదయ ప్రవేశాలకు అర్హులని తెలిపారు. 2011 మే 1 నుంచి 2013 ఏప్రిల్ మధ్యలో జన్మించిన విద్యార్థులు, తమ పాఠశాల హెచ్ఎం నుంచి ధ్రువీకరణ పత్రంతో పాటు ఫొటో, ఆధార్ కార్డు జెరాక్స్ జతపరచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పరీక్షా కేంద్రాన్ని అభ్యర్థే ఎంపిక చేసుకొనే వెసులుబాటు ఉందన్నారు.

చిన్నారులను అలరించిన 'చిన్న కొండచుట్టు'

నగరి: పట్టణంలోని భేరివీధిలో బుధవారం నిర్వహించిన చిన్న కొండచుట్టు ఉత్సవాలు చిన్నారులను అలరించాయి. కొండచుట్టు ఉత్సవాలకు మరుసటి రోజున భేరివీధిలో చిరు వ్యాపారులు దుకాణాలు పెట్టడం పరిపాటి. దీంతో వీధిలో తిరనాళ్ల సందడి నెలకొంది. స్థానికులు దీన్ని చిన్న కొండచుట్టు ఉత్సవాలుగా పిలుచుకుంటారు. చిన్నారుల ఆటబొమ్మలు, మహిళలకు సంబంధించిన అలంకరణ వస్తువులు, చెరుకు గడలు, తినుబండారాలు ఇక్కడ అధికంగా విక్రయించారు. వివిధ రకాలైన రంగుల రాట్నాల్లో తిరగడానికి పిల్లలు ఉత్సాహం చూపారు. దీంతో వీధి మొత్తం జనంతో నిండిపోయింది.



భేరివీధిలో చిన్న కొండచుట్టు సందడి

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి



జగనన్న లేఅవుట్‌లో పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్

పాలసముద్రం: మండలంలోని జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం వెంగళరాజుకుప్పం పంచాయతీ ఇందిరా నగర్ జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణ పనులను డీఈ పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలని కోరారు. సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్టు చెప్పారు. కార్యక్ర మంలో ఏఈ మధు, ఇంజినీర్ అసిస్టెంట్ యశ్వంత్ పాల్గొన్నారు.

బాబు మెప్పుకోసమే ఆరోపణలు

పెనుమూరు(కార్వేటినగరం): చంద్రబాబు మెప్పు పొందడానికే ఎస్.బీ సుధాకర్‌రెడ్డి మంత్రులపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా యువత ప్రధాన కార్యదర్శి విజయకుమార్ రెడ్డి అన్నారు. పెనుమూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన బుధవారం నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగిరినట్టు అన్న చందాన కనీసం గ్రామంలో వార్డు మెంబర్‌గా గెలుపొందని టీడీపీ అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి మంత్రులపై విమర్శలు గుప్పిస్తున్నారని ఎద్దేవా చేశారు. మంత్రిపై విమర్శలు గుప్పిస్తే మండలంలో తిరగనీయబోమని హెచ్చరించారు. సుధాకర్‌రెడ్డి వార్డు మెంబర్‌గా గెలిచినా రాజకీయ సన్యాసం తీసుకుంటామని సవాల్ చేశారు.



విలేకర్ల సమావేశంలో విజయకుమార్‌రెడ్డి

కోలాహలంగా ఎడ్ల పందేలు



ఎద్దును నిలువరిస్తున్న యువకుడు

ఐరాల: మండలంలోని కంచంవారిఇండ్లు గ్రామంలో బుధవా రం కోలాహలంగా ఎద్దుల పోటీలను గ్రామస్తులు నిర్వహించారు. కనుమ పండుగ మరుసటి రోజు కంచంవారిఇండ్లులో ఎద్దుల పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో వెలసిన సత్యమ్మకు ప్రత్యేక పూజలు, పొంగిళ్లు, అభిషేకాలు చేశారు. గోవులు, ఎద్దులను శుభ్రం చేయించి, కొమ్ములకు రంగులు వేశారు. పూలమాలలు, రంగు కాగితా లు, గాలిబుడగలతో అలంకరించి, పూజలు చేశారు. అనంతరం ఎద్దులు, కోడెగిత్తలను పరుగులు తీయించారు. కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు, పెద్దలు పోటీ పడ్డారు. గిత్తలకు కట్టిన తాళ్లను పట్టుకున్న యువకులు విజయోత్సాహంతో కేరింతలు కొట్టారు. ఈ పోటీలను తిలకించేందుకు వచ్చిన జనంతో గ్రామం సందడిగా మారింది. మిద్దెలు, చెట్లు ఎక్కి పోటీలను తిలకించారు.



దూసుకొస్తున్న ఎద్దు

అడిగిన వారందరికీ ఉపాధి

పాలసముద్రం: మండల పరిధిలోని ఉపాధిహామీ పథకంలో ఇచ్చిన జాబ్‌కార్డులున్న వారందరికీ పనులు చిత్తూరు క్లస్టర్ ఏపీడీ సుబ్రమణ్యం తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ విద్యావతి సమీక్షలో ఉపాధి హామీ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో చేస్తున్న పనుల్లో నాణ్యత తప్పక పాటించాలన్నారు. ఈ నెలలో 10 వేల పనిదినాలు పూర్తి చేయాల్సిన బాధ్యత ఏపీఓ బాలపై ఉందని తెలిపారు. ముఖ్యంగా 100 రోజులు పనులు పూర్తయిన కుటుంబాల సంఖ్య పెరగాలని సూచించారు. కార్యక్రమంలో జేఈ అనుషా, టెక్నికల్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, భూపతి, రంగనాథం, ఫీల్డ్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ సుబ్రమణ్యం

ఉచిత పశు వైద్య శిబిరానికి స్పందన

పాలసముద్రం: మండలంలోని పాడిపశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, మేకలు, గొర్రెలకు సకాలంలో నట్టల నివారణ మందు మయడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయని పశువైద్యాధికారిణి యశస్వి అన్నారు. బుధవారం పాలసముద్రం రైతు భరోసా కేంద్రం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 15 పాడి పశువులకు చూలు కట్టడానికి టీకాలు వేశారు. 10 మేకలు నట్టల మందులు పిచికారీ చేశారు. పాడి రైతులతో పశువైద్యాధికారిణి మాట్లాడారు. మూగజీవాలకు వచ్చే సీజనల్ వ్యాధులు, వాటి బారిన పడకుండా జీవాల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.



పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి యశస్వి

తిరువళ్లువర్‌కు ఘన నివాళి

నగరి: తమిళ కవి తిరువళ్లువర్ దినమ్, గ్రంథాలయ వార్షికోత్సవం పురస్కరించుకుని స్థానిక సత్రవాడలోని తిరువళ్లువర్ గ్రంథాలయ ఆవరణలో తిరువళ్లువర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. చర్చావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తిరుక్కురల్ సంబంధిత అంశాలపై కవితలు, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులను సన్మానించారు. తిరువళ్లువర్ యువజన సంఘ నిర్వాహకులు ముత్తయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విశ్రాంత ఉపాధ్యాయులు సుందరమూర్తి, తమిళ ఉపాధ్యాయులు అక్బర్ మాట్లాడారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు



నగదు బహుమతులు అందజేస్తున్న ప్రకాష్, మురళీమోహన్

క్రీడలతోనే మానసికోల్లాసం

వెదురుకుప్పం: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్ ప్రకాష్ అన్నారు. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని చైతన్య కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో వెదురుకుప్పంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ బుధవారం సాయంత్రం ముగిసింది. విన్నర్స్‌గా నిలిచిన డ్రీమ్స్ లెవన్‌కు జట్టుకు రూ.31,111, రన్నర్స్‌గా నిలిచిన చవటగుంట జట్టుకు రూ. 20,222 నగదు బహుమతులను అందజేసి ఆయన మాట్లాడారు. క్రీడా పోటీలతో వ్యక్తులు, ప్రాంతాల మధ్య స్నేహ సంబంధాలు పెరుగుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల పట్ల యువత మక్కువ చూపాలన్నారు. కార్యక్రమంలో పెరుమాళ్లపల్లె ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌మురళి, నిర్వాహకులు నందకుమారి, చైతన్య కన్‌స్ట్రక్షన్స్ ఎండీ చైతన్యకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి ముఖ హాజరు తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ముఖ హాజరు నమోదు చేయాలని కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని విభాగాల అధిపతులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ రాష్ట్ర ప్రభుత్వం ఫేషియల్ హాజరు తప్పనిసరి చేసిందన్నారు. ఇందులో ఏపీఎఫ్ఆర్ఎస్ యాప్‌లో పేరు నమోదు చేసుకొని హాజరు కచ్చితంగా వేయాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెలవుకోసం అనుమతి తీసుకుంటే ఆన్‌లైన్‌లో కచ్చితంగా అప్లోడ్ చేయాలని స్పష్టం చేశారు. శాఖల వారీగా విధులకు దీర్ఘకాలిక గైర్హాజరైన వారిపై చర్యలు చేపట్టాలని, అలాంటి ఫైల్స్ ఉంటే వెంటనే పంపాలన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, పీఆర్,ఆర్–బి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు చంద్ర శేఖర్ రెడ్డి, దేవానందం, నాగ జ్యోతి, హౌసింగ్ పీడీ పద్మ నాభం, సీపీఓ ఉమాదేవి, డ్వామా పీడీ గంగా భవాని, డీపీఓ లక్ష్మి, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ సంక్షేమ జిల్లా అధికారులు రాజ్యలక్ష్మి, రబ్బానీ బాషా, చిన్నారెడ్డి మూర్తి ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన

ఐరాల: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ మస్తానీబేగం ఆధ్వర్యంలో ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా వైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. సీఆర్పీ శైలజ పాల్గొన్నారు.



జిల్లాలో పట్టు సాగుకు మరింత ప్రోత్సాహం

- మల్బరీ సాగులో ఏడాదికి ఐదు నుంచి ఆరు పంటలు
- ఏనుగుల బెడద తక్కువ
- సమీక్షలో కలెక్టర్ హరినారాయణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : మంచి ఆదాయం ఉన్న పట్టు సాగుకు మరింత ప్రోత్సాహం అందించి, రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పడాలని కలెక్టర్ హరి నారాయణన్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం పట్టు సాగుపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మొదట పట్టు పరిశ్రమ శాఖ ద్వారా ఇస్తున్న పలు రాయితీలపై సంబంధిత జాయింట్ డైరెక్టర్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒక ఎకరా విస్తీర్ణంలో మల్బరీ సాగు చేస్తే ఐదుగురికి ఉద్యోగం ఇచ్చినట్టుగా ఉంటుందని చెప్పారు. డిప్లొమా చేసిన వారికి మంచి అవకాశాలు కల్పించాలని అన్నారు. ఏడాదికి ఐదు నుంచి ఆరు పంటలు వచ్చే అవకాశం ఉందని వివరించారు. మంచి ఆదాయం ఈ శాఖ ద్వారా వస్తున్నందున రైతులను మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి 100 గుడ్లకు 75 కిలోల వరకు దిగుబడి వస్తోందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహకాలు అందరికీ అందేలా చూడాలని అన్నారు. జిల్లాలో ఎక్కువ సాగు చేస్తున్న రామకుప్పం, శాంతిపురం, వీకోట, బైరెడ్డిపల్లి, పలమనేరు, గంగవరం మండలాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేశారు. ప్రధానంగా ఏనుగుల బెడద పంటకు తక్కువ ఉన్నందున అటవీ ప్రాంతాలలో ఈ పంటను వేసేలా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఎప్పటికప్పుడు పరిష్కరించండి

రైతుల సమస్యలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. వ్యవసాయ శాఖ సమీక్షలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఖర్చు తక్కువ, ఆదాయం ఎక్కువగా వచ్చే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రధానంగా భూసారాన్ని బట్టి పంటలను వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలుగా జామ, బొప్పాయి, మిరప, చింత, దానిమ్మ, అరటి, డ్రాగన్ ఫ్రూట్, పాషన్ ఫ్రూట్, ఆమ్లా, కరొండ, వంటి పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. పంటల ఉత్పత్తి ప్రారంభం నాటు నుంచి రైతులకు అవగాహన కల్పించి మంచి ఆదాయం వచ్చేలా చూడాలని ఆదేశించారు. నాణ్యత గల కూరగాయలు, పూలు, పండ్లు ఉత్పత్తి చేయించడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూధన్ రెడ్డి, కోటేశ్వర రావు పాల్గొన్నారు.

మరింత బాగా పనిచేయాలి

జిల్లాలో వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల అధికారులు మరింత బాగా పనిచేసి ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ అన్నారు. గర్భిణులు, చిన్నపిల్లల్లో రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారికి సరైన వైద్యం అందించాలన్నారు. సకాలంలో ఆహారం అందించే ప్రక్రియను చేపట్టాలని చెప్పారు. జిల్లాలో అనీమియా సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని సూచించారు. సీజన్లో వచ్చే సమస్యలను దృష్టిలో పెట్టుకుని వైద్య సేవలు అందించాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రకాశం, డీఐఓ రవి రాజు, డీసీహెచ్ఎస్‌బీసీ కే నాయక్, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ రాజశేఖర్ రెడ్డి, డీపీఎంఓ శ్రీనివాసరావు, ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ సుదర్శన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో హరినాథ్ రెడ్డి, ఎస్ఓ రమేష్ రెడ్డి, డీపీహెచ్ఎన్ఓ రేణుక ప్రభ తదితరులు పాల్గొన్నారు.